www.prajasakti.com
ప్రజాశక్తి
బుధవారం 7 జూన్ 2023
5



రమేష్ సేవలు ప్రశంసనీయం

ప్రజాశక్తి-ఉప్పలగుప్తం

ఉప్పలగుప్తం పిహెచ్‌సిలో పని చేస్తూ హెల్త్ సూపర్ వైజర్‌గా ఉద్యోగోన్నతి పొందిన దొమ్మేటి రమేష్ సేవలు ప్రశంసనీయమని పలువురు అన్నారు. ఆయన ఐ.పోలవరం మండలం కేశనకుర్రు పిహెచ్ సికి బదిలీ అయ్యారు. పి హెచ్ సి లో మంగళవారం వైద్యాధికారి డాక్టర్ ఎల్.నాగార్జున అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో దొమ్మేటిరమేష్, శ్రీదేవి దంపతులను సత్కరించారు. కార్యక్రమంలో వైద్యాధికారులు ఎ. ఇంద్రావతి, ఎల్.దివ్యజ్యోతి, సిహెచ్‌ఒ ఎం.విజయలక్ష్మి, హెల్త్ సూపర్‌వైజర్ ఐ.చిట్టిబాబు, పిహెచ్‌సి సిబ్బంది పాల్గొన్నారు.



రమేష్ దంపతులను సత్కరిస్తున్న వైద్య సిబ్బంది

ఇదేమి చోద్యం..

వంటకాలువ తవ్వి, రోడ్డుకు మట్టి వేసుకున్న కాంట్రాక్టర్

స్పందించని ఇరిగేషన్ శాఖ అధికారులు

ఆగ్రహం వ్యక్తం చేస్తున్న రైతులు

ప్రజాశక్తి-రామచంద్రపురం

రైతులకు ఉపయోగపడే పంట కాలువ గట్టును తవ్వి రోడ్డు నిర్మాణానికి ఉపయోగించుకుంటున్న కాంట్రాక్టర్ ఉదంతం వెలుగు చూసింది. దీనికి సంబంధించిన వివరాలు ఇవి.. కె.గంగవరం మండలంలోని ఎర్ర పోతవరం గ్రామం నుంచి శివల గ్రామానికి రోడ్డును ఆధునికీకరిస్తున్నారు. ఇందులో భాగంగా రోడ్డుకు అప్రోచ్ మెంట్ నిర్మాణానికి గ్రావెల్ వాడడానికి బదులు కాంట్రాక్టర్ ఎర్ర పోతవరం నుంచి శివల వరకు గల వంటకాలువ గట్టును ప్రొక్లెయినర్‌తో తొలగించి ఆధునికీకరిస్తున్న రోడ్డుకు వేశారు. ప్రస్తుతం తొలకరి పంటకు రాష్ట్ర ప్రభుత్వం సాగునీటిని విడుదల చేస్తుండగా పంట కాలువకు గల గట్టును తొలగించడంతో రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు సుమారు రెండు కిలోమీటర్ల గట్టును రోడ్డు కాంట్రాక్టర్ తొలగించినా ఇరిగేషన్ అధికారులు పట్టించుకోవడంలేదని రైతులు మండిపడుతున్నారు. ఈ విషయమై కొంతమంది రైతులు కాంట్రాక్టర్ ను నిలదీయగా పంట చేలు మట్టిని తీసి మళ్లీ గట్టు నిర్మిస్తామని చెప్పడం ఆశ్చర్యానికి గురిచేస్తోంది. అసలు ఉన్న గట్టును తొలగించి మళ్లీ గట్టు నిర్మాణం చేపట్టడం ఏమిటని పలువురు ప్రశ్నిస్తున్నారు. దీనిపై ఇరిగేషన్ అధికారులు రహదారి భవనాల శాఖ అధికారులు వెంటనే స్పందించాలని. అప్రోచ్ మెంట్ కు కంకర వాడకుండా కాలువ గట్ల మట్టిని వాడటం పై వెంటనే చర్యలు చేపట్టాలని వంటకాలువ గట్టును తిరిగి పునరుద్ధరించాలని శివల పరిసర ప్రాంతాల రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు.



తవ్వేసిన పంట కాలువ గట్టు



కాలువ గట్టు మట్టి తీసి రోడ్డుకు అప్రోచ్‌మెంట్ నిర్మించిన దృశ్యం

తొలకరిలో సాగునీటికి ఇక్కట్లు



పోతవరం నుంచి శివల గ్రామం వచ్చే పంట కాలువ గట్టును తొలగించడం వల్ల తొలకరిలో రైతులకు ఇక్కట్లు తప్పవని ఆందోళన చెందుతున్నాం. ఈ పంట కాలువపై సుమారు 200 ఎకరాలు పంట భూమి సాగు అవుతుందని కాలువ బట్టి తొలగించడం వల్ల నీరు శివారు ప్రాంతాలకు అందే అవకాశం లేదని వెంటనే గట్టును పునరుద్ధరించాలి. దీనిపై ఇరిగేషన్ అధికారులు స్పందించి వెంటనే చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

-బలుసు సూర్యనారాయణ, రైతు, శివల గ్రామం

రైతులకు నష్టం జరిగితే ఊరుకోం



రోడ్డు ఆధునికీకరణ పేరుతో కాలు వ గట్లను తవ్వేయడం మంచి పని కాదు. రైతు లకు నష్టం జరిగితే ఊరుకోం. రెండు కి.మీ మేర పంట కాలువ గట్టును తవ్వి రోడ్డు కు అప్రోచ్‌మెంట్ నిర్మించడమేమిటి. దీనిపై రోడ్డు భవనాల శాఖ ఇరిగేషన్ శాఖ స్పం దించి కాలువ గట్టు పునరుద్ధరణ చర్యలు చేపట్టాలి. తొలకరి పం టకు నీరు వచ్చేందుకు కాలువ గట్టులేకపోతే రైతులకు నష్టం వాటి ల్లు తుం ది. రోడ్డు కాంట్రాక్టర్‌తోనూ రైతులతో మాట్లాడి సమస్య పరిష్క రిం చాలి. **-ఇళ్ల సూర్య నారాయణ, ఛైర్మన్, మండల వ్యవసాయ సలహా కమిటీ**

ఉపాధి చట్టాన్ని నిర్వీర్యం చేయొద్దు

వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు

కారెం వెంకటేశ్వరరావు డిమాండ్

ప్రజాశక్తి-ఐ.పోలవరం

కేంద్ర ప్రభుత్వ విధానాలతో ఉపాధి చట్టాన్ని నిర్వీర్యం చేయొద్దని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు కారెం వెంకటేశ్వరరావు డిమాండ్ చేశారు. కొమరగిరి గ్రామ పంచాయతీ పరిధిలో ఉపాధి కూలీలు పని చేస్తున్న ప్రదేశంలో మంగళవారం ఆయన పర్యటించారు. వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఉపాధి హామీ చట్టంలో రెండు పూటలా పని రద్దు చేయాలని, సమ్మర్ అలవెన్స్ 40 శాతం ఇవ్వాలని, 100 రోజులు పూర్తి చేసిన కుటుంబానికి అదనంగా రాష్ట్ర ప్రభుత్వం పనిచూపించాలన్నారు. గ్రామాలతో పాటు పట్టణాల్లో కూడా పని కల్పించాలన్నారు. పని చేసే చోట కనీస సౌకర్యాలైన టెంట్, నీళ్లు, మెడికల్ కిట్ ఇవ్వాలన్నారు. నీళ్లకు రూ.10, గునపం స్రానకు రూ.50, తట్టకు రూ.20 ఇవ్వాలన్నారు. ఆన్లైన్ మస్టర్ రద్దు చేసి పాత పద్ధతిని అమలు చేయాలన్నారు. పే స్లిప్ ఇవ్వాలని, క్షేత్రస్థాయి మేట్లకు స్మార్ట్ ఫోన్ ఇవ్వాలని, రూ.5 పారితోషికం ఇవ్వాలని అన్నారు. వ్యవసాయ పనులు లేని సమయంలో ఉపాధిహామీ చట్టం కూలీలను కాపాడుతుందని ఎండా కాలంలో ఏ పనులు దొరకక వ్యవసాయకూలీలు మొదలుకొని డిగ్రీ చదువుకున్న యువత ఉపాధి పనులకు వెళుతున్నారని అన్నారు. ఉపాధి చట్టానికి మరింత నిధులు పెంచి అమలు చేయాల్సిన కేంద్రం ఉపాధి చట్టాన్ని ఎత్తివేసి మన పొట్ట కొట్టాలని చూస్తోందన్నారు. కార్పొరేట్లకు రూ.లక్షల కోట్లు సబ్సిడీగా ఇస్తూ ఉపాధి హామీ చట్టానికి నిధులు కోత విధిస్తుందని ఎద్దేవా చేశారు.



ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న కారెం తదితరులు

ఉపాధి హామీ చట్టాన్ని పటిష్టంగా అమలు చేసే చర్యలు కేంద్రం చేపట్టాలని డిమాండ్ చేశారు. ఉపాధి చట్టంలో రెండు పూటల పని చేయాలని ఒత్తిడి చేస్తున్నారని సమ్మర్ అలవెన్స్ రద్దు చేశారని, మంచినీళ్లు, పార, తట్ట, గడ్డపార పదునుకు ఇచ్చే డబ్బులు నిలిపి వేశారన్నారు. ఆన్లైన్ మస్టర్లు పెట్టి పేదలను ఇబ్బందులు పెడుతున్నారన్నారు. పోరాడి సాధించుకున్న ఈ చట్టాన్ని సక్రమంగా అమలు చేయమని కోరాలని కూలీలకు కేటాయించే నిధులను సిమెంట్ రోడ్లకు, భవనాలకు మళ్లిస్తున్న ఎపి ప్రభుత్వం ఉపాధి కూలీల పొట్టమీద కొడుతోందన్నారు. ఉపాధి చట్టం ఉంటే పెత్తందార్ల మాట చెల్లుబాటు కావడం లేదని కనుక ఈ చట్టాన్ని రద్దు చేయాలని గోల చేస్తున్నారన్నారు. వీరి మాటలకు తలొగ్గిన కేంద్రం అనేక షరతులు పెట్టి మనమే పని మానుకునేలా కుట్ర చేస్తోందన్నారు. దీనిని వ్యతిరేకించాలని పిలుపు నిచ్చారు. అలాగే కోనసీమ జిల్లాలో భూస్వాముల చేతుల్లో ఉన్నటువంటి కొబ్బరి చెట్లను ప్రభుత్వం సర్వే చేసి భూమిలేని వ్యవసాయ కార్మికులకు, ఎస్‌సిల్లో ఉన్న పేదలకు పంచాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు పాము బాలయ్య, రామ చంద్రరావు, పాటి ఈశ్వరి, నాగమణి, శ్రీదేవి, అలివేలు, మణి, మేట్లు, కూలీలు పాల్గొన్నారు.

తొలకరి సాగుకు సన్నద్ధం

నారుమళ్లు సిద్ధం చేస్తున్న రైతులు

ప్రజాశక్తి-మండపేట

మండపేట పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో తొలకరి సాగుకు రైతులు సమాయత్తమవుతున్నారు. ఇప్పటికే మోటార్ నీరు అందుబాటులో ఉన్న రైతులు నారుమళ్లు సిద్ధం చేసుకోవడంలో నిమగ్నమయ్యారు. మండపేట, పట్టణ గ్రామీణ ప్రాంతాల్లో 6832 హెక్టార్లలో వరి సాగు జరుగుతుందని విత్తనాలు, ఎరువులు రైతు భరోసా కేంద్రం సొసైటీలో అందుబాటులో ఉన్నాయని మండల వ్యవసాయ అధికారి ఏసుబాబు అన్నారు. ఈనెల 20 నాటికి నారుమళ్లు, జులై నెల 20 నాటికి ఊడుపులు తదితర వ్యవసాయ పనులు పూర్తి చేసుకోవాలని, వెద జల్లే పద్ధతిలో రోజులు కలిసి వచ్చే అవకాశం ఉందని మురగు దమ్ము చేసుకోవాలని రైతులకు సూచించారు. 150 ఎకరాల్లో ఇప్పటికే రైతులు నారుమళ్లు సిద్ధం చేశారని ఆయన అన్నారు



పట్టణ శివారులో ఆకుమడి కోసం సిద్ధం చేసిన రైతు

జాతీయ స్థాయి క్రికెట్ పోటీలకు శ్రీరామకృష్ణ ఎంపిక

ప్రజాశక్తి-ఆలమూరు

చొప్పెల్ల విద్యుత్ శాఖలో లైన్‌మ్యాన్‌గా విధులు నిర్వహిస్తున్న అడబాల శ్రీరామకృష్ణ జాతీయ స్థాయి క్రికెట్ పోటీలకు ఎంపికయ్యారు. అతను తన విధులను నిర్వహిస్తూ, మరో పక్క తనకు ఇష్టమైన క్రికెట్ క్రీడలో రాణిస్తున్నారు. ఇందులో భాగంగా ఇటీవల రాష్ట్ర స్థాయిలో విశాఖలో విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన అంతర్ జిల్లాల క్రికెట్ టోర్నమెంట్లో శ్రీరామకృష్ణ ఆల్‌రౌండర్‌గా రాణిం చారు. దీంతో ఆయన జాతీయ స్థాయిలో గుజరాత్‌లో జరిగే క్రికెట్ టోర్నమెంట్‌కు ఎంపికయ్యారు. ఈ పోటీలకు ఎపి నుంచి 18 మంది క్రీడాకారులు పాల్గొంటుండగా ఉమ్మడి గోదావరి జిల్లాల్లో విద్యుత్ శాఖ నుంచి అడబాల శ్రీరామకృష్ణ మాత్రమే ఎంపికైయ్యాడు. విద్యుత్ శాఖ డిఇ దాట్ల శ్రీధర్ వర్మ, మండపేట ఎడిఇ జి.తిరుమలరావులు శ్రీరామకృష్ణను అభినందించి జాతీయ స్థాయి క్రికెట్ పోటీల్లో రాణించాలని ఆకాంక్షించారు.



వైజాగ్‌లో కప్ అందుకుంటున్న లైన్‌మ్యాన్ శ్రీ రామకృష్ణ

నేడు ఎంఎల్‌ఎ కుమారుని వివాహానికి సిఎం రాక

ప్రజాశక్తి-రాజోలు

సిఎం జగన్ బుధవారం మలికిపురం మండలంలో రాజోలు ఎంఎల్ఎ రాపాక వరప్రసాదరావు కుమారుడు వెంకటరామ్ వివాహానికి హాజరుకానున్నారు. మలికిపురంలో ఏర్పాటుచేసిన హెలిప్యాడ్, కల్యాణ వేదికలను కలెక్టర్ హిమాన్షు శుక్లా, ఎస్‌పిలు పరిశీలించారు. శానిటేషన్, బారికేడ్స్, వాహనాల పార్కింగ్ ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ సూచించారు. సిఎం మధ్యాహ్నం 2 గంటలకు తాడేపల్లి నుంచి హెలి కాప్టర్‌లో బయలుదేరి 2:55 గంటలకు మలికిపురం చేరుకుంటారు. 3:05 గంటల వరకూ ప్రజా ప్రతినిధులను కలుసుకుని, 3:20 గంటలకు మలికిపురం మండలం కత్తిమండ ఎంఎల్ఎ స్వగృహ ప్రాంగణంలోని కల్యాణ వేదిక వద్దకు వెళతారు. 3:30 గంటల వరకూ అక్కడే ఉండి సాయంత్రం 3:40 గంటల నుంచి 4 గంటల వరుకు నాయకులతో సమావేశమవుతారు. అనంతరం హెలికాప్టర్‌లో తాడేపల్లి వెళతారు. సిఎం పర్యటన సందర్భంగా మలికిపురం, గుడిమెళలంక మధ్య జాతీయ రహదారిపై ట్రాఫిక్ మళ్లిస్తున్నట్లు ఎస్ఐ సురేందర్ తెలిపారు.

వాచ్‌మ్యాన్ నియామకాల్లో జిఒ అమలుకు డిమాండ్

సిఐటియు ఆధ్వర్యంలో ధర్నా

ప్రజాశక్తి-ముమ్మిడివరం

హైస్కూల్ వాచ్‌మ్యాన్ పోస్టులను ఆయా భర్తలకే ఇవ్వాలన్న ప్రభుత్వ జిఒ అమలు చేయాలని సిఐటియు నాయకులు డిమాండ్‌చేశారు. ఈ సందర్భంగా జిల్లా విద్యాశాఖ అధికారి కార్యాలయం వద్ద సిఐటియు ఆధ్వర్యంలో మంగళవారం ధర్నా నిర్వహించారు. సిఐటియు నాయకులు మాట్లాడుతూ హై స్కూల్ వాచ్‌మెన్ పోస్టులను ఆయా భర్తలకే ఇవ్వాలని ప్రభుత్వం జిఒ విడుదల చేసినప్పటికీ కాట్రేనికోన మండలం పల్లం కుర్రు పంచాయతీ సాపేవారిపల్లి హైస్కూల్లో స్థానిక రాజకీయ నాయకులు, హెచ్‌ఎం కలిసి వైసిపి కార్యకర్తలకు ఇస్తున్నారన్నారు. కొమరగిరి హై స్కూల్లో వైసిపి కార్యకర్తకు ఇవ్వాలని స్కూల్ హెచ్‌ఎంపై వత్తిడి తెస్తున్నార అని ఇదే విషయాన్ని మండల విద్యాశాఖ అధికారి దష్టి తీసుకెళ్లినప్పటికీ డిఇఒ స్పందించకపోవడంతో ధర్నా నిర్వహించాము అన్నారు. ఈ ధర్నాకి ముఖ్యఅతిథిగా సిఐటియు జిల్లా కార్యదర్శి నూకల బలరాం హాజరయ్యి వారు మాట్లాడుతూ స్కూల్ ఆయా లు జీతాలు లేకుండా ఆరు సంవత్సరాల పాటు ఉచితంగా సేవలందించారన్నారు. ఇదే విషయాన్ని సిఎం జగన్ దష్టికి తీసుకెళ్లామని ఆయన స్పందించి హైస్కూల్లో వాచ్మెన్ పోస్టులను ఆయాభర్తలకే ముందు ప్రాధాన్యత ఇచ్చి ఆ విధంగా అన్ని స్కూల్లో అమలు చేయాలని జిఒ విడుదల చేశారన్నారు. అయినప్పటికీ కొన్ని హై స్కూల్లో సంబంధిత అధికారులు పాటించలేదన్నారు. ఇప్పటికైనా డిఇఒ స్పందించి ఎవరైతే ఆయాగా పనిచేస్తున్నారో వాళ్ళ భర్తలకే వాచ్మెన్ పోస్టులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. మే, జూన్ నెలల్లో ఒక పూట మాత్రమే పనిచేయాలని జిఒ విడుదల చేసినప్పటికీ కొన్ని హైస్కూల్లో రెండు పూటలా బలవంతంగా పనిచేయిస్తున్నారన్నారు. ఏదో ఒక పూట మాత్రమే పని చేయించుకోవాలని అన్నారు. పూర్తి జీతం ఇచ్చి పని చేసుకుంటే మాకు ఎటువంటి అభ్యంతరం లేదని, కానీ రాష్ట్ర ప్రభుత్వం సగం జీవితం మాత్రమే ఇస్తున్నారని అన్నారు. అనంతరం జిల్లా విద్యాశాఖ అధికారికి వినత పత్రం సమర్పించారు. సమస్య పరిష్కారించకపోతే రిలే నిరాహార దీక్షలు చేపడుతామని జిల్లా విద్యాశాఖ అధికారికి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ముమ్మిడివరం సిఐటియు మండల అధ్యక్షులు నిమ్మకాయల వెంకటేష్, కాట్రేనికోన సిఐటియు మండల అధ్యక్షులు విప్పర్తి మోహన్ రావు, బొంతుపార్వతి, స్కూల్ ఆయా వర్కర్ల యూనియన్ నాయ కులు కె.వెంకటలక్ష్మి, కె.గంగారత్నం, గంటి అనంతలక్ష్మి, సుబ్బలక్ష్మి, సత్య నారాయణమ్మ, కన్నీడి మంగాదేవి, వెర్రమ్మ, స్కూలు ఆయాలు పాల్గొన్నారు.



డిఇఒ కార్యాలయం సిఐటియు ఆధ్వర్యంలో ధర్నా



వైద్య సేవలు అందిస్తున్న డాక్టర్ రత్నకుమారి

76 మందికి వైద్య పరీక్షలు

ప్రజాశక్తి-కపిలేశ్వరపురం

అంగర పిహెచ్‌సి పరిధిలోని మండల కేంద్రమైన కపిలేశ్వరపురం బిసి ఏరియా రామాలయం వద్ద మంగళవారం నిర్వహించిన ఫ్యామిలీ ఫిజీషియన్ వైద్య శిబిరంలో 76 మందికి వైద్యపరీక్షలు నిర్వహించారు. గ్రామ సర్పంచ్ సాకా శ్రీనివాస్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో నిర్వహిస్తున్న ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. డాక్టర్ పిఎన్ఎస్‌డి.రత్నకుమారి ఆధ్వర్యంలో వైద్య సిబ్బంది పలు వ్యాధులకు సంబంధించి రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులను అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ రత్నకుమారి మాట్లాడుతూ ప్రతి నెలా 1వ మంగళవారం ఎఫ్‌పిసి బందం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు గర్భిణులను, పిల్లలను, బిపి, షుగర్ పేషంట్లను, వృద్ధులను పరీక్షించారు. అవసరమైన వారికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశామన్నారు. కార్యక్రమానికి వచ్చిన గర్భిణులు, వృద్ధులు, బాలింతలకు కార్యక్రమ ప్రాముఖ్యతను హెల్త్ ఎడ్యుకేటర్ బి. రామారావు వివరించారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్లు పి.సురేష్, టి.మేరీమణి, ఎంఎల్ హెచ్‌పి పి.దివ్యశ్రీ, హెల్త్‌అసిస్టెంట్‌లు టి.రామకృష్ణారావు, వి.వెంకటేశ్వర్లు, ఎఎన్ఎంలు పి శిరోమణి, పి.ఝాన్సీభాయ్,ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంఎల్ఎ వేగుళ్ల

అప్రోచ్ రోడ్డు పనులు పూర్తి చేయాలని డిమాండ్

ప్రజాశక్తి-మండపేట

స్థానిక పెద్ద కాలువ రెండవ వంతెన అప్రోచ్ రోడ్డు పనులు పూర్తయ్యేది ఎప్పటికని ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు ప్రశ్నించారు. మంగళవారం ఆయన పట్టణ టిడిపి అధ్యక్షులు ఉంగరాల రాంబాబు, జెడ్ మేడపాడు సర్పంచ్ కంచర్ల చంద్రశేఖర్ తదితర టిడిపి నాయకులతో కలిసి సెల్ఫీ ఛాలెంజ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2005లో అప్పటి సిఎం వైయస్ రాజశేఖర్ రెడ్డి రోడ్డు రూ.75 లక్షలతో రెండవ వంతెనకు శంకుస్థాపన చేశారన్నారు. 2018లో రూ.75 లక్షలకు మరో రూ.6 లక్షలు పెంచి రూ.81 లక్షలతో గత టిడిపి ప్రభుత్వ హయాంలో వంతెన నిర్మాణం పూర్తి చేశారన్నారు. అయితే నాటి నుంచి నేటి వరకు అప్రోచ్ రోడ్డు పని జరగలేదన్నారు. వైసిపి ప్రభుత్వం ఏర్పడి నాలుగు సంవత్సరాల పూర్తయిన ఈ అప్రోచ్ రోడ్డుకు మోక్షం కలగలేదన్నారు. ఇప్పటికైనా అప్రోచ్ రోడ్డు పనులు పూర్తి చేసి పట్టణంలోని ట్రాఫిక్ సమస్యను పరిష్కరించాలన్నారు.

రిజర్వేషన్ కౌంటర్‌ను కొనసాగించాలని వినతి

ప్రజాశక్తి-అమలాపురం

2001 లో ప్రారంభమైన దక్షిణ మధ్య రైల్వే రిజర్వేషన్ కౌంటర్ ను రేపటి లోగా మూసివేయాలని రైల్వే అధికారులు ఉత్తర్వులు జారీ చేశారని, ఈ కౌంటర్ కొనసాగేలా తగిన చర్యలు తీసుకోవాలని కోరుతూ మంగళవారం కోనసీమ రైల్వే సాధన సమితి జిల్లా కలెక్టర్ శుక్లా కు వినతి పత్రం అందజేశారు. ఈ రైల్వే కౌంటర్ కోనసీమ ప్రజలకు అడ్వాన్స్ రిజర్వేషన్, తత్కాల్ రిజర్వేషన్, క్యాన్సిలేషన్ రాయితీలు, అందజేస్తోందని , సెలవలు లేకుండా సంవత్సరం పొడవునా పనిచేస్తోందని తెలియజేశారు. పోస్ట్ ఆఫీస్ కౌంటర్లో ఈ సౌకర్యాలు ఉండవని చెప్పారు. కెఆర్ఎస్ఎస్ విజ్ఞాపనకు కలెక్టర్ వెంటనే స్పందించి విజయవాడ లోని రైల్వే అధికారులతో మాట్లాడారు . మునిసిపల్ ఛైర్మన్, అధికారులు, కౌన్సిలర్స్ తో సమావేశం ఏర్పాటుచేసి చర్చించి సమస్యలు పరిష్కరించేందుకు చొరవ తీసుకుంటానని వారికి చెప్పారు. రిజర్వేషన్ కౌంటర్ అప్పటిదాకా ఉన్నచోటనే కొనసాగించాలన్నారు. ఇందుకు రైల్వే అధికారులు అంగీకరించారు. డాక్టర్ ఇఆర్.సుబ్రహ్మణ్యం, ఎం ఎల్‌సి కుడుపూడి సూర్యనారాయణ రావు, తాతాజీ, మట్టపర్తి నాగేంద్ర, కడలి దుర్గాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



కలెక్టర్ హిమాన్షుశుక్లాకు వినతిపత్రం అందిస్తున్న దృశ్యం

ముమ్మిడివరం పజలకు అందుబాటులో అన్నివేళలా సేవలందిస్తూ లాభాలను ఆర్జించి పెడుతున్న అమలాపురం రైల్వే రిజర్వేషన్ కౌంటర్ ను ఎత్తివేయడం ప్రజాహితం కాదు ప్రజల సౌకర్యార్థం దానిని బేషరతుగా కొనసాగించాలని జిల్లా జన విజ్ఞాన వేదిక కమిటీ తీర్మానించింది. మంగళవారం నిర్వహించిన సమావేశానికి జిల్లా జెవివి అధ్యక్షులు జనిపల్లి సత్యనారాయణ అధ్యక్షత వహించారు. సీనియర్ నాయకులు, జెవివి జిల్లా గౌరవ అధ్యక్షులు డాక్టర్ ఇఆర్.సుబ్రహ్మణ్యం, అకాడమిక్, చెకుముకి జిల్లా కన్వీనర్ ఎన్.అబ్బులు, అమలాపురం సీనియర్ నాయకులు బి.వెంకటేశ్వరరావు, పి.రాంబాబు, జిల్లా ప్రధాన కార్యదర్శి కెవివి.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఉమ్మడి జిల్లా సర్పంచుల సంఘం అధ్యక్షురాలిగా శాంతకుమారి

ప్రజాశక్తి - అంబాజీపేట

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా సర్పంచుల సంఘం అధ్యక్షురాలిగా అంబాజీపేట మండలం మాచవరం సర్పంచ్ నాగాబత్తుల శాంతకుమారి సుబ్బారావు ను నియమిస్తూ రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షులు యలమంచిలి బాబు రాజేంద్రప్రసాద్ మంగళవారం నియామకు ఉత్తర్వులు అందజేశారు. కాకినాడలో జరిగిన సర్పంచ్ ల సమాఖ్య సమావేశంలో 2022- 23 ఆర్థిక సంవత్సరానికి ఎపిలో 12,918 గ్రామ పంచాయతీలకు కేంద్ర ఆర్థిక సంఘం రూ.2,020 కోట్లు రాష్ట్ర ప్రభుత్వం నేటి వరకు పంచాయతీలకు జమ వేయలేదన్నార. నిధులపై స్పష్టమైన ప్రకటన చేయాలని రాజేంద్రప్రసాద్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గ్రామ పంచాయతీల ఆధీనంలోకి సచివాలయ, వాలంటీర్లు వ్యవస్థ అనుసంధానం చేయాలని జిల్లా అధ్యక్షురాలు చర్చించారు.



శాంతకుమారికి ఉత్తర్వులు అందిస్తున్న రాష్ట్ర అధ్యక్షులు

ఈ కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షులు వానపల్లి లక్ష్మీ ముత్యాలరావు, సర్పంచులు బొబ్బ ప్రభాత్, కాకర శ్రీను, జల్లి బాలరాజు, వార సావిత్రి, తదితరులు పాల్గొన్నారు. శాంతా కుమారి నియామకం పట్ల పలువురు అభినందిస్తూ శుభాకాంక్షలు తెలిపారు.



ఆందోళన చేస్తున్న గ్రామస్తులు

సెల్ టవర్ పనులు నిలిపివేయాలని ఆందోళన

ప్రజాశక్తి-ఆత్రేయపురం

మండలంలోని నార్కెడిమిల్లి గ్రామంలో గహ సముదాయాల పక్కనే సెల్ టవర్ నిర్మాణం పై స్థానిక ప్రజలు మంగళవారం ఆందోళన వ్యక్తం చేశారు సెల్ టవర్ నిర్మిస్తున్న స్థలం వద్ద బైఠాయించి పనులు నిలుపుదల చేసే వరకు ఆందోళన విరమించమని వారు మండిపడ్డారు. తక్షణమే టవర్ నిర్మాణ పనులు నిలుపుదల చేసి పంచాయితీ తీర్మానం రద్దు చెయ్యాలని. ఊరు చివర టవర్ నిర్మించుకోవాలి అంటూ నినాదాలు చేశారు. ఈ ఆందోళనలో ఆకుల రమణ, వంగలపుడి సూరిబాబు, కోపెళ్ళ శ్రీరామ్, ఉనుకుల రాంబాబు, ఆకుల భ్రమరాంభ, ప్రభావతి తదితరులు పాల్గొన్నారు.

బోధనా పద్ధతులపై శిక్షణ

ప్రజాశక్తి-కాట్రేనికోన

చెయ్యేరు శ్రీనివాస స్వయం ప్రతిపత్తి ఇంజినీరింగ్ కళాశాల లో అధ్యాపకుల బోధనలో నాణ్యతకు సంబంధించిన " అధునాతన బోధనా పద్ధతులు" అనే అంశంపై శిక్షణా తరగతుల్ని ఐక్యూఎసి ద్వారా కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ డివిఎన్ఎస్.వర్మ ప్రారంభించారు .ఈ శిక్షణా తరగతులకు ముఖ్య అతిథిగా ఎన్ఐటిటిటి అర్ కోల్‌కత్తా కు చెందిన అధ్యాపక బోధనా పద్ధతుల శిక్షణా నిపుణులు డాక్టర్ ఊర్మిళ కార్ విచ్చేశారు. ఈ సందర్భంగా ఆమె ప్రసంగిస్తూ విద్యారంగంలో వస్తున్నటువంటి మార్పులకనుగుణంగా బోధనా విధానమును సాంకేతిక తో మేళవించి , ప్రయోగాత్మక పద్ధతుల్లో వివరించుట వల్ల విద్యార్థులలో అభిరుచిని పెంపొందింపవచ్చునన్నారు. అనంతరం పలు అంశాలను పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా విశదీకరించారు కార్యక్రమం లో సభాధ్యక్షులు, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సిహెచ్‌విఎస్ పరమేశ్వర రావు, కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ డివిఎన్ఎస్.వర్మ, కళాశాల పాలకవర్గ సభ్యులు సందీప్, రమేష్ రాజు, కళాశాల విద్యాశాఖాధిపతి డాక్టర్ ఎస్.జయలక్ష్మి, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

రామేశ్వరం యాత్రకు ప్రత్యేక బస్సు


ప్రజాశక్తి-రావులపాలెం

ఎపి రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ రావులపాలెం నుంచి ప్రయాణికుల సౌకర్యర్థం రామేశ్వ రానికి ప్రత్యేక యాత్ర స్పెషల్ బస్సు సర్వీసు ఏర్పాటు చేశామని డిపో మేనేజర్ కెడిఎంఎస్.కుమార్ మంగళవారం ఒక ప్రకటన లో తెలిపారు. ఏడు రోజుల యాత్రకు సూపర్ లగ్జరీ బస్సుఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. ఈ బస్సు ఈనెల 18 బయలుదేరి 25న తిరిగి రావులపాలెం చేరుకుంటుందన్నారు. ఒక వ్యక్తికి భోజనంతో రూ.8000లు అన్నారు. యాత్రలు కాణి పాకం, అరుణాచలం, చిదంబరం, కుంభకోణం, వైదీశ్వరన్ కోయిల్, తంజావూరు, తిరువారూర్, తిరుకడయూర్, రామేశ్వరం, ధనుష్ కోటి తదితర పుణ్యక్షేత్రాలు ఉంటాయన్నారు. వివరాలకు రావులపాలెం డిపో సెల్: 7382911871 ను సంప్రదించాలన్నారు.

విఆర్ఒ కుమారునికి ఉద్యోగం

ప్రజాశక్తి-రామచంద్రపురం

అనారోగ్యంతో ఉన్న ద్రాక్షారామ విఆర్ఒ మనోహర్ రిటైర్మెంట్ తీసుకున్నారు. దీనితో ఆయన కుమారునికి రామచంద్రపురం ఆర్‌డిఒ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా నియమించారు. మనోహర్ కుమారుడు లక్ష్మణ్‌కు మంగళవారం ఉద్యోగ బాధ్యతలకు సంబంధించి జిఒ ఇచ్చిన సిఎం జగన్, రెవెన్యూ మంత్రి ధర్మాన, భూపతి రాజా, పరిపాలనా అధికారులు సాయి ప్రసాద్, ఇంతియాజ్‌లకు, కారుణ్య నియామకాల జిఒ సాధించిన విఆర్ఒ సంఘం అధ్య క్షులు భూపతిరాజు రవీంద్రరాజుకు, ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాల విఆర్ఒల గౌరవ అధ్యక్షులు మద్దాల బాపూజీ కృతజ్ఞతలు తెలిపారు.



నియామక పత్రాలు అందిస్తున్న మంత్రి వేణు

జిల్లా కేంద్ర బ్యాంక్ పానల్ అడ్వకేట్ గా సాయి ప్రసాద్

ప్రజాశక్తి-రామచంద్రపురం

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ ప్యానల్ అడ్వకేట్‌గా పట్టణానికి చెందిన వాడ్రేవు సాయి ప్రసాద్‌ను నియమించారు. ఈ మేరకు స్థానిక ఎండిఒ కార్యాలయంలో జరిగిన సొసైటీ ఛైర్మన్ల సమావేశంలో నియామక పత్రాలను రాష్ట్ర బిసి సంక్షేమ శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకష్ణ చేతుల మీదుగా మంగళవారం అందజేశారు. డిసిసి. బ్యాంక్ జిల్లా ప్యానెల్ అడ్వకేట్‌గా సిఫార్సు చేసిన మంత్రి వేణుగోపాల కష్ణకు, ప్యానల్ అడ్వకేట్‌గా నియమించిన డిసిసి బ్యాంక్ ఉమ్మడి జిల్లా ఛైర్మన్ ఆకుల వీర్రాజు కు సాయిప్రసాద్ కతజ్ఞతలు తెలియజేశారు.

కార్టూ'నిజం'



నేరాలు ఘోరాలు

కత్తిపోట్లకు దారితీసిన ఆస్తి తగాదా

ప్రజాశక్తి - ఏలేశ్వరం

ఆస్తి తగాదా అన్నదమ్ముల మధ్య కత్తిపోట్లకు దారి తీసింది. ఈ ఘటన మండలంలోని సి.రాయవరంలో మంగళవారం చోటు చేసుకుంది. ఏలేశ్వరం ఎస్ఐ జి.సతీష్ తెలిపిన వివరాల మేరకు... మండలంలోని సి.రాయవరం గ్రామానికి చెందిన కేశవరపు రాజబాబు, కేశరపు వెంకటేశ్వరరావు అన్నదమ్ములు. వారికి ఏలేశ్వరం మెయిన్‌రోడ్‌లో నాలుగు దుకాణాలు ఉన్నాయి. వాటి పంపకాల విషయంలో కొంతకాలంగా వీరి మధ్య తగాదా నడుస్తుంది. ఈ నేపథ్యంలో మంగళవారం మళ్లా తగాదా ఏర్పడింది. కేశవరపు రాజుబాబుపై వెంకటేశ్వరరావు అతని కుమారుడు ప్రసాద్ కత్తితో దాడి చేశారు. ఈ దాడిలో రాజబాబు తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు వెంటనే రాజబాబుని ఏలేశ్వరం ప్రభుత్వాసుపత్రి తరలించారు. మెరుగైన చికిత్స కోసం కాకినాడకు తీసుకెళ్లారు. రాజబాబు భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్ఐ తెలిపారు.

సారా కేసులో ఒకరు అరెస్ట్

ప్రజాశక్తి - పెద్దాపురం

పెద్దాపురం ఎస్ఇబి స్టేషన్ పరిధిలో ఎస్ఇబి సిఐ కెవి.స్వామి ఆధ్వర్యంలో మంగళవారం సారా బట్టీలపై దాడులు నిర్వహించారు. ఒకరిని అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచామని ఎస్ఇబి ఎస్ఐ వై.నాగేంద్రకృష్ణ తెలిపారు. వివిధ సారా కేసులకు సంబంధించిన ఏడుగురిపై బైండోవర్ కేసులు పెట్టి జగ్గంపేట తహాశీల్దార్ కోర్టులో హాజరు పరిచామన్నారు. గుడివాడ గ్రామంలో పరివర్తన కార్యక్రమంలో భాగంగా సారా, మత్తు పదార్థాల వినియోగం, అనర్థాలపై అవగాహన కల్పించామన్నారు. ఈ దాడుల్లో ఎక్సైజ్ సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి తీవ్రగాయాలు

ప్రజాశక్తి - గండేపల్లి

గండేపల్లి జాతీయ రహదారిపై సింగరంపాలెం వెళ్లే కూడలి వద్ద మంగళవారం మోటార్ సైకిల్, ఆటో ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో బైకు నడుపుతున్న వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. కోరుకొండ మండలం గాదరాడకు చెందిన వనం అప్పారావు జగ్గంపేట వైపు నుంచి మురారికి వెళు _న్నాడు. పక్కనున్న ఆటో ఒక్కసారిగా రోడ్డుపైకి రావడంతో ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో ఆటో బోల్తా పడింది. గాయాలైన అప్పారావును 108లో రాజమండ్రి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

గాయపడిన వ్యక్తి మృతి

ప్రజాశక్తి - పెద్దాపురం

పులిమేరులో గుర్తు తెలియని వాహనం ఢీ కొట్టిన ప్రమాదంలో తీవ్రంగా గాయపడి కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న శ్రీమంతుల రాజు (45) మంగళవారం పరిస్థితి విషమించడంతో మృతి చెందాడని పోలీసులు తెలిపారు. రాజపూడికి చెందిన రాజు పులిమేరులోని బంధువుల ఇంటికి వచ్చాడు. ఈనెల 4న బహిర్భూమికి వెళ్లి వస్తుండగా గుర్తు తెలియని వాహనం ఢీ కొట్టి వెళ్లిపోయిందని పోలీసులు తెలిపారు. అప్పటి నుంచి రాజు కాకినాడ జిజిహెచ్‌లో చికిత్స పొందుతున్నాడని, పరిస్థితి విషమించడంతో మృతి చెందాడని ఎస్ఐ వి.సురేష్ తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేశామన్నారు.

ఎడ్ల బండి బోల్తా

ప్రజాశక్తి-తాళ్లపూడి

తాళ్లపూడి ఏటిగట్టుపై మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో ఎడ్ల బండి బోల్తాపడింది. ఒక ఎద్దు మృత్యువాత పడింది. గ్రామానికి చెందిన శ్రీనివాస్ ఎడ్ల బండి తీసుకెళ్తుండగా ఈ ప్రమాదం జరిగింది. ఒక ఎద్దు అక్కడికక్కడే మృత్యువాత పడగా, మరో ఎద్దుకు గాయాలయ్యాయి. గాయపడిన శ్రీనివాస్‌ను రాజమండ్రి తరలించారని హెచ్‌సి భగవాన్‌దాస్ తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేశామన్నారు.

కోటిపల్లి రేవులో మత్స్యకారుని మృతి

ప్రజాశక్తి-రామచంద్రపురం

కె.గంగవరం మండలంలోని కోటిపల్లి రేవులో మత్స్యకారుడు ప్రమాదవశాత్తూ మృతి చెందాడు. రేకాడి శ్రీను సోమవారం రాత్రి పడవపై వెళ్తూ ప్రమాదవశాత్తు గోదావరిలో పడిపోయాడు. మృతదేహం మంగళవారం లభ్యం అయింది మతునికి భార్య, కుమారుడు ఉన్నారు. మృతుని భార్య రేకాడి నూక రత్నం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి కె.గంగవరం పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

యాక్టివాను దగ్ధం చేసిన దుండగులు

ప్రజాశక్తి-ఆలమూరు

మండల కేంద్రంలో సోమవారం అర్ధరాత్రి యాక్టివా స్కూటర్ను తెలియని దుండగులు దగ్ధం చేశారు. స్థానిక రథం వీధిలో ఉంటున్న భూపతిరాజు సుధాకర్ రాజు ఇంటి వద్ద పార్క్ చేసి ఉన్న తన యాక్టివా స్కూటర్ను ఎవరో పెట్రోల్ పోసి నిప్పు పెట్టి దగ్ధం చేసినట్లు గుర్తించారు. జరిగిన ఘటనపై సుధాకర్ రాజు పోలీసులకు ఫిర్యాదు చేశారు. నిత్యం రద్దీగా ఉండే రథం వీధిలో ఇటువంటి సంఘటన జరగడంపై స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దుండగులను వెంటనే గుర్తించి శిక్షించాలని వారంతా పోలీసులను కోరారు.

చోరీ కేసులో నిందితుని అరెస్ట్

ప్రజాశక్తి- రామచంద్రపురం

పట్టణం లోని చింతపల్లి సూరన్న నగర్ కి చెందిన అయినవిల్లి ప్రసాద్ ఇంట్లో జరిగిన చోరీ కేసులో నిందితుడిని పోలీసులు అరెస్ట్ చేశారు. వివరాలు ఇవి.. గత నెల మే 30 న ఇంటికి తాళం వేసుకుని పని నిమత్తం తణుకు వెళ్లిన ప్రసాద్ ఇంట్లో ఆ రోజు రాత్రి గుర్తు తెలియని దొంగలు ప్రవేశించి సుమారు 20 గ్రాముల బంగారం, రూ. 30 వేల నగదు దొంగిలించారు. ఈ ఘటనపై ఫిర్యాదును పట్టణ ఎస్ఐ డి.సురేష్ బాబు నమోదు చేశారు. రామచంద్రపురం డిఎస్‌పి టిఎస్ఆర్ కె.ప్రసాద్ పర్యవేక్షణలో, సిఐ వి.దుర్గారావు ఆధ్వర్యంలో దర్యాప్తు చేశారు. రాజనగరం మండల పరిధిలోని రాధేయపాలెం గ్రామానికి చెందిన రెడ్డి సురేష్‌ను నిందితునిగా గుర్తించి కొత్తూరు జంక్షన్ వద్ద పట్టుకున్నారు. అతని వద్ద నుంచి బంగారం మొత్తం ను రికవరీ చేసి, నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్ కి పంపించామని ఎస్ఐ తెలిపారు. చోరులను గుర్తించడంలో కీలక పాత్ర వహించి, త్వరితగతిన కేసును ఛేదించిన ఎస్ఐ డి.సురేష్ బాబు, కానిస్టేబుల్స్ జగదీష్, సూరిబాబు, హోం గార్డ్స్ మహేష్, కుమార్ రాజాలను ఎస్పి. ఎస్.శ్రీధర్ అభినందించారన్నారు.

సర్పంచ్‌ల హక్కుల కోసం ఐక్య పోరాటాలు

ప్రజాశక్తి - కాకినాడ

హక్కుల రక్షణ కోసం ఐక్య పోరాటాలు చేయాలని, దీనికి రాజకీయ పార్టీలకతీతంగా కలిసి రావాలని ఆంధ్రప్రదేశ్ సర్పంచుల సంఘం, ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ ఛాంబర్ సర్పంచ్‌లకు పిలుపునిచ్చింది. మంగళవారం కాకినాడలోని సత్యలవాహిని ఆడిటోరియంలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా సర్పంచ్‌ల సదస్సు జరిగింది. ఈ సదస్సులో ముఖ్యఅతిథిగా సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు వైబి.రాజేంద్రప్రసాద్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో 12,900 పంచాయతీలకు ఆర్థిక సంఘం 2021 నిధులను విడుదల చేసినా అవి ఎందుకు రాష్ట్ర ప్రభుత్వం పక్కదారి మళ్లించిందో చెప్పాలని డిమాండ్ చేశారు. అలాగే కేంద్రం, రాష్ట్ర ఆర్థిక సంఘం నిధులతో కలిపి 2021-22 సంవత్సరానికి రూ.8,860 కోట్ల పంచాయతీ నిధులు రాష్ట్ర ప్రభుత్వం చోరీ చేసిందన్నారు. ఈ మేరకు పంచాయతీ ఛాంబర్ తరపున కేసు నమోదు చేశామని, త్వరలోనే కోర్టు దీనిపై తీర్పు ఇచ్చే అవకాశం ఉందని చెప్పారు. రాష్ట్రంలోని సర్పంచ్‌లు అందరూ హక్కుల సాధన, గ్రామాల అభివృద్ధి కోసం పోరాడాలన్నారు. సర్పంచ్‌ల సమర శంఖారావం పేరుతో రాష్ట్ర వ్యాప్త ఉద్యమం చేస్తామని ప్రకటించారు. ఈ ఉద్యమంలో వార్డు సభ్యులనూ భాగస్వాములు చేయాలన్నారు. ఉద్యమంలో భాగంగా జిల్లా పరిషత్, కలెక్టరేట్ల వద్ద భారీ ధర్నాలు, చలో ఢిల్లీ కార్యక్రమాలను నిర్వహించాలని సూచించారు.

సంఘం రాష్ట్ర అధ్యక్షులు వానపల్లి లక్ష్మి మాట్లాడుతూ సర్పంచ్‌ల పరిధిలోకి సచివాలయాలు, వాలంటీర్లను తీసుకు రావాలన్నారు. సచివాలయం కన్వీనర్లగా రాజకీయ పార్టీ కన్వీనర్ల వ్యవస్థను రద్దు చేయాలన్నారు. గ్రామ సచివాలయాల పేరుతో ఎంఎల్ఎలకు రూ. 20 లక్షల నిధులను పంచాయతీలకు ఇవ్వాలన్నారు. సర్పంచుల ద్వారానే వీటిని అభివృద్ధి పనులకు ఖర్చు చేయాలన్నారు. అలాగే సర్పంచ్, ఎంపిటిసిలకు రూ.15వేలు, ఎంపిపి, జడ్పిటిసిలకు రూ.30 వేల గౌరవ వేతనం ఇవ్వాలని కోరారు. ప్రభుత్వం నిధులు ఇవ్వకపోవడంతో గ్రామాలు అభివృద్ధికి దూరంగా ఉండిపోయాయన్నారు. దీంతో చాలా గ్రామాల్లో సర్పంచులు సొంత నిధులను ఖర్చుపెట్టి పలు పనులను నిర్వహించారన్నారు. నిధులు లేక సర్పంచ్‌లు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ సమావేశంలో సర్పంచుల సంఘం నాయకులు నాగాబత్తుల శాంతికుమారి, కాకర శ్రీనివాస్, బొబ్బ ప్రభాత్‌కుమార్, సలాది బుచ్చిరాజు, రంబాల రమేష్, గుడాల రాంబాబు, వారా జయసావిత్రి, బూసి జయలక్ష్మి, వేజర్ల ప్రమోద్ కుమార్‌రాజు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతన్న రాజేంద్రప్రసాద్

యానాం వార్తలు



భారీ కేక్‌ను కట్ చేస్తున్న మల్లాడి కృష్ణారావు

ఘనంగా మల్లాడి పుట్టినరోజు

ప్రజాశక్తి - యానాం

పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావు 60వ పుట్టినరోజు వేడుకలు స్థానిక యర్రా గార్డెన్‌లోని మల్లాడి స్వగృహం వద్ద అభిమానులు మంగళవారం ఘనంగా నిర్వహించారు. ముందుగా మల్లాడి కృష్ణారావు ఉదయలక్ష్మి దంపతులను, కుమారుడు వంశీ, అనుపమ దంపతులను పండితులు వేద ఆశీర్వచనం అందించారు. వందలాది మల్లాడి అభిమానులతో యానాంలో బైకు ర్యాలీ నిర్వహించారు. ప్రముఖ గాయకుడు గజల్ శ్రీనివాస్ తన పాటలతో, ప్రసంగాలతో అలరించారు. యానాం కళాకారులు, పల్సర్ బైక్ ఝాన్సీ, పొట్టి రమేష్, జెట్టి చిత్ర బృందం చేసిన డ్యాన్సులు ఆకట్టుకున్నాయి. పుట్టిన రోజు సందర్భంగా కిడ్నీ రోగులకు ఉచితంగా డయాలసిస్ చేసేందుకు అపోలో అధికారులతో ఒప్పందం కుదుర్చుకున్నారు. ఈ మేరకు ఒప్పంద పత్రాలను ఓల్డేజ్ హోమ్ కో-ఆర్డినేటర్ పెసల గంగయ్యకు అందించారు. అభిమానులు మధ్య మల్లాడి కృష్ణారావు భారీ కేకును కట్ చేశారు. అమలాపురం ఎంపీ చింతా అనురాధ, ముమ్మిడివరం ఎంఎల్ఎ పొన్నాడ సతీష్‌కుమార్, జనసేన నాయకులు పితాని బాలకృష్ణ, ముమ్మిడివరం మార్కెట్ కమిటీ చైర్మన్ కుడిపూడి శివన్నారాయణ, పలువురు ప్రముఖులు ఆయనకు పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపారు. గజమాలలు, పుష్పగుచ్ఛాలు, శాలువాలతో సత్కరించారు. మల్లాడి అభిమాన సంఘం ద్వారా విందు భోజనం ఏర్పాటు చేశారు. ఎన్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మల్లాడి శామ్యూల్ ఆధ్వర్యంలో పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గిడ్ల చంద్రరావు, పెండెం సూర్య ప్రకాష్, కోన కొండబాబు, గూటం శివగణేష్, మల్లాడి రాజు, మల్లాడి అభిమానులు పాల్గొన్నారు.



పాగతో మూసుకుపోయిన రహదారి

పొగతో ఉక్కిరిబిక్కిరి

యానాం నియోజకవర్గ పరిధిలోని కనకాల పేట డంపింగ్ యార్డలో చెత్తకు నిప్పుపెట్టడంతో దుర్వాసన, పొగతో స్థానికులు, ప్రయాణికులు, వాహన చోదకులు ఇబ్బందులు పడుతున్నారు. డంపింగ్ యార్డ్‌లో చెత్తకు నిప్పు పెట్టి వదిలేశారని వారంటున్నారు. వెంటనే మంటలను అదుపు చేసి కాలుష్యాన్ని నియంత్రించాలని పలువురు కోరుతున్నారు.

మందుబాబులకు అడ్డాగా మార్కెట్ కాంప్లెక్స్

ప్రజాశక్తి - యానాం

యానాం పరిధిలోని రాజీవ్ గాంధీ మార్కెట్ కాంప్లెక్స్ మందుబాబులకు అడ్డాగా మారింది. దీంతో మత్స్యకారులు,వ్యాపారస్తులు ఇబ్బందులకు గురవుతున్నారు. ప్రతిరోజూ మార్కెట్ ప్రాంతంలో మద్యం సేవించిన తర్వాత కాళీ బాటిళ్లను అక్కడే వదిలేయడం, కొన్ని పగుల గొట్టడంతో మార్కెట్లోకి వచ్చేవారు గాయపడుతున్నారు. మార్కెట్ కాంప్లెక్స్‌లో ఎటువంటి నిఘా లేకపోవడంతో మందుబాబుల ఆగడాలు మితిమీరుపోతున్నాయని స్థానికులు చెబుతున్నారు. సాయంత్రం సమయానికి మద్యం సేవించడానికి మందుబాబులు మార్కెట్లోకి ప్రవేశిస్తున్నారు. సంబంధిత అధికారులు తక్షణమే స్పందించి మద్యం సేవిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



మార్కెట్ కాంప్లెక్స్‌లో తాగి పడేసిన మద్యం బాటిళ్లు

అంబులెన్స్‌లో ప్రసవం..

ప్రజాశక్తి-రావులపాలెం

ప్రసవ వేదనతో బాధపడుతున్న మహిళను స్థానిక వైద్యులు సూచన మేరకు రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలిస్తుండగా అంబులెన్స్‌లోనే ఆ మహిళ ప్రసవించింది. రావులపాలెం మండలం ఉబలంక గ్రామానికి చెందిన శీలం భవాని పురిటినొప్పులతో బాధపడుతుండగా సమీపంలో గల ప్రాథమిక కేంద్రానికి తరలించారు. అయితే ఆమెకు గర్భంతో ఉండగా వచ్చే ఫిట్స్ (గుర్రపు వాతం) అధికమవ్వడంతో ఆమెను వెంటనే రాజమహేంద్రవరం తరలించాలని స్థానిక ఆసుపత్రి వైద్యులు సూచించారు. వెంటనే ఆమెను 108 అంబులెన్సు ద్వారా తరలిస్తుండగా వేమగిరి దాటిన తర్వాత పురిటి నొప్పులు అధికమై బిడ్డ బయటికి వస్తుండగా ఇఎంటి.చిట్టిబాబు, అంబులెన్సు డ్రైవర్ (పైలెట్) సిహెచ్.దేవేంద్రబాబు సహాయంతో అంబులెన్స్ లోనే చాకచక్యంగా సులువైన ప్రసవం చేసి బిడ్డను సురక్షితంగా బయటికి తీశారు. అనంతరం తల్లీ బిడ్డకు వైద్య సదుపాయాన్ని అందిస్తూ జిల్లా ఆసుపత్రి రాజమహేంద్రవరం తరలించారు. తల్లీ బిడ్డా క్షేమంగా ఉన్నారని రాజమహేంద్రవరం ప్రభుత్వ వైద్యులు తెలియజేశారు. దీంతో కుటుంబ సభ్యులు ఆనందం వ్యక్తం చేశారు.



టిడిపి ఎంఎల్ఎల అరెస్టులు అక్రమం

ప్రజాశక్తి-సామర్లకోట రూరల్

టిడిపి ఎంఎల్ఎలు బాలవీరాంజనేయస్వామి, నిమ్మల రామానాయుడు అరెస్టులు అక్రమమని పెద్దాపురం ఎంఎల్ఎ నిమ్మకాయల చినరాజప్ప విమర్శించారు. సామర్లకోట మండలం అచ్చంపేట క్యాంపు కార్యాలయంలో మంగళవారం ఆయన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. ఎంఎల్ఎ డోలా బాల వీరాంజనేయస్వామిపై వైసిపి ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతుందన్నారు. ప్రజలకు నిరసన తెలిపే హక్కులేదా? అని ఆయన ప్రశ్నించారు. వైసిపి నేతలకు పోలీసులు తొత్తులుగా వ్యవహరిస్తున్నారన్నారు. అక్రమ అరెస్టులు, వేధింపులకు భయపడేది లేదన్నారు. వైసిపి నాయకుల అక్రమ మైనింగ్‌ను అడ్డుకుంటే అరెస్టు చేస్తారా? అని ప్రశ్నించారు. ఎంఎల్ఎలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

వాలంటీర్లు ప్రభుత్వానికి ప్రజలకు వారధులు

ప్రజాశక్తి-సామర్లకోట రూరల్

ప్రభుత్వ సంక్షేమ పథకాలు ఇతర కార్యక్రమాలు ప్రజలకు అందించడంలో వాలంటీర్లు ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారధులు పనిచేస్తూ కీలక పాత్ర పోషిస్తున్నారని ఏపీ స్టేట్ హౌసింగు కార్పోరేషన్ చైర్మన్, దవులూరి దొరబాబు పేర్కొన్నారు. పెదబ్రహ్మదేవంలో మంగళవారం వాలంటీర్లను సత్కరించారు. దవులూరి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. కొంత వాలంటీర్ల వ్యవస్థపై విపక్షం చేస్తున్న ఆరోపణలను ఖండించారు. వాలంటీర్లను ఘనంగా సత్కరించి అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి బొబ్బరాడ సత్తిబాబు, వైస్ ఎంపిపి పేర్నిడి వెంకటరాయుడు ఎంపిడిఒ డి.శ్రీలలిత, తహశీల్దార్ లక్ష్మీనరసకుమారి, ఇఒపిఆర్‌డి హరికృష్ణ సత్యారెడ్డి, సర్పంచ్ నీలపాల సత్యనారాయణ, ఎంపిటిసి మలకల సూర్యారావు (సూరిబాబు), సొసైటీ అధ్యక్షులు మలకల వరాలబాబు, వైసీపీ రాష్ట్ర కార్యదర్శి ఆవాల లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.



మల్లాడికి శుభాకాంక్షలు తెలిపిన శ్రీకాంత్

అమలాపురం : మాజీ మంత్రి మల్లాడి కష్ణారావు పుట్టినరోజు సందర్భంగా రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్ తనయుడు డాక్టర్ శ్రీకాంత్ మంగళవారం ఆయన స్వగృహంలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మల్లాడికి పుష్ప గుచ్ఛం అందించారు.

విద్యార్థులకు స్పోకెన్ ఇంగ్లిష్‌లో శిక్షణ

ప్రజాశక్తి - పెద్దాపురం

స్థానిక శాఖా గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరంలో మంగళవారం విద్యార్థులకు స్పోకెన్ ఇంగ్లీష్, తెలుగు వ్యాకరణం, తెలుగు పద్యాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో హుస్సేన్‌పురానికి చెందిన తెలుగు పండిట్ ఎం.రుషికుమార్, రిటైర్డ్ హిందీ పండిట్ ఎఎస్ఆర్‌కెఎస్.ప్రసాద్ శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి పాలంకి నాగరాజు, సిబ్బంది, పాఠకులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ పోస్టులకు దరఖాస్తులకు స్వీకరణ

ప్రజాశక్తి-కపిలేశ్వరపురం

కపిలేశ్వరపురం ఐసిడిఎస్ ప్రాజెక్టు పరిధిలోని కపిలేశ్వరపురం, కె.గంగవరం మండలాల్లో ఖాళీగా ఉన్న 8 అంగన్‌వాడీ సహాయకురాలు పోస్టులకు ఈనెల 16వ తేదీ వరకు దరఖాస్తులను స్వీకరించనున్నట్లు ఐసిడిఎస్ సిడిపిఒ ఎ.గజలక్ష్మి తెలిపారు. మంగళవారం ఆమె ఈ పోస్టులకు సంబంధించిన వివరాలను విలేకరులకు వెల్లడించారు. అంగన్‌వాడీ సహాయకురాలు పోస్టులు కపిలేశ్వరపురం మండలంలోని నల్లూరు-1లో (బిసి-ఇ), పడమర ఖండ్రికలో (బిసి-ఎ), కపిలేశ్వరపురంలో (ఎస్‌టి) కి కేటాయించారన్నారు. అలాగే కె.గంగవరం మండలం నరజాడ (బిసి-ఎ), రావిదొడ్డిపేట (ఎస్ సి), తామర పల్లి (ఒసి), శేరేలంక(ఒసి), కె.గంగవరం 3 (బి సి-డి)లకు కేటాయించారన్నారు. అంగన్‌వాడీ సహాయకురాలు పోస్టులకు వివాహిత మహిళా అభ్యర్థినులై ఉండి పదవ తరగతి ఉత్తీర్ణత, 21 సంవత్సరాల నుంచి 35 ఏళ్లలోపు వయస్సు కలిగి ఉండాలన్నారు. దరఖాస్తులను ఈ నెల 16వ తేదీ సాయంత్రం 5 గంటల లోగా ఐసిడిఎస్ కార్యాలయం లో అందజేయవచ్చన్నారు. వివరాలకు ఐసిడిఎస్ కార్యాలయాన్ని సంప్రదించాలన్నారు.

రైలు ప్రమాద మృతులకు నివాళి

ప్రజాశక్తి-మండపేట

ఒడిశాలోని బాలాసోర్ జిల్లాలో జరిగిన రైలు ప్రమాదంలో అసువులు బాసిన వారికి నివాళిగా మండపేట పట్టణంలో జాతీయ బిసి సంఘం ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ర్యాలీ మంగళవారం రాత్రి నిర్వహించారు. ఈ సందర్భంగా బిసి సంఘ నాయకులు పిల్లి శ్రీనువాస్, కోన సత్యనారాయణలు మాట్లాడుతూ ఇది దేశంలో నాలుగో అతిపెద్ద రైలు ప్రమాదం అన్నారు. ఓ చిన్నపాటి నిర్లక్ష్యం వందల కుటుంబాల్లో తీరని దుఖాన్ని మిగిల్చిందన్నారు. ఈ ఘటనపై సిబిఐ విచారణ చేసి ప్రమాదానికి కారణమైన వారిని కఠినంగా శిక్షించి చనిపోయిన వారి కుటుంబాలకు రూ.15 లక్షల పరిహారం చెల్లించి ఇంటికో ఉద్యోగం ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. క్షతగాత్రులైన వారికి మెరుగైన వైద్యం అందించి ప్రభుత్వాలు అండగా నిలవాలని కోరారు. ఈకార్యక్రమంలో సంఘ నాయకులు పెంకె గంగాధరరావు, టేకి శ్రీను, శీలామంతుల సత్యనారాయణ, చుక్కల అప్పారావు,చుక్కల సూరిబాబు, సూరంపూడి సత్యప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

అందరికీ సంక్షేమ పథకాలు

పెద్దాపురం : వైసిపి ప్రభుత్వం రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలు అమలు అవుతున్నాయని హౌసింగ్ కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్ దవులూరి దొరబాబు అన్నారు. మంగళవారం కొండపల్లిలో జరిగిన గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. గ్రామంలోని ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాలను వివరించారు..ఈ కార్యక్రమంలో జడ్‌పిటిసి సభ్యులు గవరసాన సూరిబాబు, ఎంపిపి పెంకే సత్యవతి, సర్పంచ్ కొత్త చక్రరావు, వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఘనంగా అశోక్ పుట్టినరోజు

అయినవిల్లి : చింతలంక గ్రామానికి చెందిన అంబాజీపేట మార్కెట్ కమిటీ మాజీ వైస్ ప్రెసిడెంట, పి.గన్నవరం నియోజకవర్గ డాక్టర్ సెల్ అధ్యక్షుడు గల్లా అశోక్ పుట్టినరోజు వేడుకలు మంగళవారం నిర్వహించారు. టిడిపి సీనియర్ నాయకులు ఒక్క లంక బుల్లియ్య, అమలాపురం ఎస్‌సి నాయకుడు చిన్నం బాల విజయ రాజు ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి పార్టీ శ్రేణులు అశోక్ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో పి గన్నవరం నియోజకవర్గ ఎస్‌సి సెల్ అధ్యక్షుడు గుమ్మడి వెంకటేశ్వరరావు, చిక్కం పల్లంరాజు, మోక శ్రీను తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు



సైన్సు ప్రయోగాలు చేస్తున్న విద్యార్థులు

శాస్త్ర సాంకేతికతపై అవగాహన అవసరం

ప్రజాశక్తి - పెద్దాపురం

చిన్ననాటి నుంచి విద్యార్థులు శాస్త్ర సాంకేతికతపై అవగాహన పెంచుకోవాలని జెవివి సైన్స్ అండ్ టెక్నాలజీ జిల్లా కన్వీనర్ బుద్దా శ్రీనివాస్ అన్నారు. యాసలపు సూర్యారావు భవనంలో చిల్డ్రన్స్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సమ్మర్ క్యాంపులో మంగళ వారు ఆయన సైన్స్ ప్రయోగాలపై అవగాహన కలిగించారు. పూజిత సూర్యశ్రీ కరాటేలో శిక్షణ ఇచ్చారు. ఈ క్యాంపులో పాల్గొన్న విద్యార్థులందరికీ గల్లా కృష్ణ, హర్ష సాయి సేవా సమితి వారు బిస్కెట్లు, స్నాక్స్, గుడ్లు అందించారు. ఈ కార్యక్రమంలో క్యాంపు కో-ఆర్డినేటర్ అరుణ్ కుమార్,రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

చిత్రలేఖనం పోటీలు

స్థానిక యాసలపు సూర్యారావు భవనంలో చిల్డ్రన్స్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సమ్మర్ క్యాంపులో విద్యార్థులకు మంగళవారం పర్యావరణం పరిరక్షణపై చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా క్యాంపు కో-ఆర్డినేటర్ రొంగల అరుణ్‌కుమార్ మాట్లాడారు. గత నెల 7 నుంచి నిర్వహిస్తున్న ఈ సమ్మర్ క్యాంపు ఈనెల 9న ముగుస్తుందన్నారు. సబ్ జూనియర్స్, జూనియర్స్, సీనియర్స్ విభాగాల్లో నిర్వహించిన ఈ పోటీల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారన్నారు. 9న జరిగే ముగింపు సభలో విజేతలకు బహుమతులు అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో చిత్రకారుడు దుంగల శ్యామ్‌కుమార్, పూజిత, సత్య, కూనిరెడ్డి రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.